

నేటి దర్శిని తెలుగు దిన పత్రిక లో
ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365



WWW.NETIDARSHINI.COM

# నేటి దర్శిని

RNI NO: TGTEL/25/A0471

తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...





Contact Number
9059328777



బుధవారం 19-08-2026 సంపుటి: 02 సంచిక : 109 వెల: 2 రూ పేజీలు :08 సంపాదకులు: కట్ట హిమ పావని

Ranga Reddy Wednesday, 19-08-2026 Volume :02 Issue: 109 RS: 2 Pages:08 Editor : Katta HimaPavani


# తప్పు ఒప్పుకుని సరిదిద్దుతున్నాం

**24 గంటల్లో 34 రిజిస్ట్రేషన్లు చేశాం**

- 22ఏ నిషేధిత జాబితాపై ప్రజలు ఆందోళన చెందొద్దు
- 15 రోజులపాటు రోజువారీగా దరఖాస్తుల పరిశీలన
- ధరణి తప్పులకు హరీశ్‌రావు సమాధానం చెప్తారా?
- ఏలేటి ఆరోపణలకు ఆధారాలుంటే చూపాలి
- రెవెన్యూ మంత్రి పొంగులేటి

హైదరాబాద్

ఇందిరమ్మ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ పేదవాడికి అన్యాయం చేయబోదనీ. పేదవాడి న్యాయబద్ధమైన భూమిలో ఒక్క అంగుళం కూడా ఈ ప్రభుత్వం తీసుకోదనీ, వారి హక్కులు, ఆస్తులకు సంపూర్ణ రక్షణ కల్పిస్తామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో తన కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో మంత్రి మాట్లాడారు. 22ఏ నిషేధిత జాబితా వల్ల ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. తప్పును ఒప్పుకుని సరిదిద్దుతున్నామని వివరించారు. ఇప్పటికే ప్రక్రియ ప్రారంభమైందనీ, 24 గంటల్లోనే మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో 30, రంగారెడ్డి జిల్లాలో నాలుగు మొత్తం 34 రిజిస్ట్రేషన్లు జరిగాయని వివరించారు.

-మిగతా 2 లో






## దేశంలో 14 మంది సీఎంలపై క్రిమినల్ కేసులు..

- 89 కేసులతో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అగ్రస్థానంలో
- సువేందు అధికారి రెండో స్థానం.. డీకే, చంద్రబాబుకు చెరో 19 కేసులు
- ప్రస్తుత, మాజీ ఎంపీలు-ఎమ్మెల్యేలపై 4,192 కేసులు పెండింగ్
- యూపీలోనే అత్యధికంగా 1,171 క్రిమినల్ కేసులు నమోదు
- తెలంగాణకు చెందిన 17 మంది ఎంపీల్లో 11 మందిపై కేసులు
- రాజ్యసభ సభ్యుల్లో 75 ని మందిపై క్రిమినల్ కేసులు
- ప్రత్యేక కోర్టుల ఏర్పాటు, హైకోర్టుల పర్యవేక్షణ కోరిన హన్సారియా

న్యూఢిల్లీ,

దేశంలోని 28 రాష్ట్రాల్లో 14 మంది సీఎంలపై క్రిమినల్ కేసులున్నాయి. అత్యధిక కేసులున్నది మాత్రం తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిపైనే. దేశంలోని సీఎంలు, ఎంపీలు, ఎమ్మెల్యేలు సహా ప్రజా ప్రతినిధులపై ఉన్న క్రిమినల్ కేసులు, వారిపై తీసుకునే చర్యలపై అమికస్ క్యూరీ, సీనియర్ న్యాయవాది విజయ్ హన్సారీ రూపొందించిన 96 పేజీల నివేదికలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. వారిపై చర్యలు తీసుకునే

-మిగతా 2 లో




## పొంగులేటి వెంటనే రాజీనామా చేయాలి

- నిషేధిత జాబితా భూములకు నైతిక బాధ్యత వహించాలి
- సారీలు చెప్పి సరిపుచ్చుకోవడం కుదరదు
- బాధితుల కోసం జనతా గ్యారేజ్ తెరిచే ఉంటుంది
- బిఆర్ఎస్ నేత హరీస్ రావు డిమాండ్

హైదరాబాద్,

మీ భూములను 22ఏ నిషేధిత జాబితా నుంచి విడిపించే వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని మాజీ మంత్రి, పార్టీ సీనియర్ నేత హరీశ్‌రావు ప్రజలకు హామీ ఇచ్చారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల ప్రజలు రిజిస్ట్రార్ ఆఫీస్ చుట్టూ.. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి నెలకొందని మండిపడ్డారు. పొంగులేటి నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. న్యాయబద్ధంగా, కష్టార్జితంతో సంపాదించిన భూములు నిషేధిత జాబితాలో ఉంటే ఫోన్ చేయాలంటూ ప్రభుత్వం టోల్ ఫ్రీ నెంబర్ ఇచ్చిందని, అయితే ఆ టోల్ ఫ్రీ నెంబర్ పనిచేయడం లేదని హరీశ్‌రావు చెప్పారు. ప్రభుత్వం ఇచ్చిన టోల్ ఫ్రీ నంబర్ పని చేయకపోయినా మా జనతా గ్యారేజ్

-మిగతా 2 లో

## ఉరిశిక్షకు బదులు విషపు ఇంజెక్షన్!



02

- ఉరిశిక్షకు ప్రత్యామ్నాయంగా ప్రాణాంతక ఇంజెక్షన్ డిమాండ్
- మరణశిక్ష అమలు పద్ధతి మార్చాలన్న పిటిషన్ కొట్టివేత
- ప్రత్యామ్నాయ పద్ధతులపై సమగ్ర సమీక్షకు అవకాశం
- ఖైదీ గౌరవం, అనవసర బాధ తగ్గింపే రాజ్యాంగ లక్ష్యం
- 2017 నాటి పిటిషన్‌పై సుప్రీంకోర్టు తీర్పు

## మెటాకు కేంద్రం వార్నింగ్




02

- పిల్లలపై లైంగిక కంటెంట్ విషయంలో మెటాకు కేంద్రం హెచ్చరిక
- చట్టాలను ఉల్లంఘిస్తే సేఫ్ హార్బర్ ప్రొటెక్షన్ ఉండదు..
- సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలన్నింటికీ ఒకే నిబంధనలు వర్తింపు
- భారత భాషలు, సంస్కృతికి అనుగుణంగా కంటెంట్ మోడరేషన్‌కు సూచన
- ఏఐ కంటెంట్‌కు లేబులింగ్ తప్పనిసరి చేయాలని కేంద్రం ఆదేశం



## సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన

- 20 నుంచి 30 వరకు ఖరారైన షెడ్యూల్
- 10 రోజుల పాటు యూకే, అమెరికాలో సీఎం పర్యటన
- మొదట లండన్ సందర్శన అనంతరం అమెరికాకు ప్రయాణం
- ఆయా దేశాల్లోని వర్సిటీల సందర్శన

హైదరాబాద్

సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా, బ్రిటన్ పర్యటన షెడ్యూల్ ఖరారయ్యింది. ఈనెల 20 నుంచి 30 వరకు యూకే, అమెరికాలో సీఎం పర్యటించనున్నారు. ఇవాళ రాత్రికి దిల్లీకి వెళ్లనున్నారు. అక్కడ జరగనున్న సీడబ్ల్యూసీ సమావేశంలో సీఎం పాల్గొంటారు. రేపు రాత్రి దిల్లీ నుంచి లండన్‌కు బయలుదేరనున్నారు. ఎల్లుండి రాత్రి 12.30 గంటలకు విమానం ఎక్కుతారు. ఈ నేపథ్యంలో సీఎం రెండు దేశాల్లో ఉన్న పలు వర్సిటీలను సందర్శించనున్నారు. అలాగే అక్కడి వర్సిటీ బృందాలతో సమావేశం కానున్నారు. లండన్‌లో పర్యటన అనంతరం రేవంత్‌రెడ్డి అమెరికాకు వెళ్తారు.

సీఎం లండన్ షెడ్యూల్ ఇదే :

ఆగస్టు 21న లండన్‌లోని ఆక్స్‌ఫర్డ్ వర్సిటీలోని బ్లావట్నిక్ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌ను సీఎం సందర్శించనున్నారు. అక్కడి ఎమిరేట్స్

-మిగతా 2 లో

సామాజిక న్యాయం
అందించిన తొలి ప్రభుత్వం

# మాదే

**సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఆవిష్కరించిన సీఎం**

- అమరవీరుల స్థూపానికి ఉన్న ప్రాధాన్యతే పాపన్న గౌడ్ విగ్రహానికి ఉండాలి
- సర్దార్ సర్వాయి పాపన్నమన అందరికీ స్ఫూర్తి ప్రదాత
- నిమ్న వర్గాలని ప్రోత్సహించేలా కాంగ్రెస్ ప్రభుత్వం
- మళ్లీ పాత దొరలు గద్దెనెక్కేందుకు కాచుకుని కూర్చున్నారు
- ఎట్టి పరిస్థితుల్లోనూ వారికి అవకాశం ఇవ్వొద్దు
- బీఆర్ఎస్‌పై విమర్శలు గుప్పించిన సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్

తెలంగాణ చరిత్రలోనే బీసీల జనాభా లెక్కలు తేల్చి సామాజిక న్యాయం అందించిన తొలి ప్రభుత్వం తమదేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాలను నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. అర్హులైన నేత, గీత కార్మికులకు పెన్షన్లు ఇవ్వాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ప్రజాపాలనను కాపాడుకోవాలని, మళ్లీ పాత దొరలు గద్దెనెక్కేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వొద్దని పిలుపునిచ్చారు. హైదరాబాద్ ట్యాంక్ బండ్ వద్ద ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని మంత్రులు, గౌడ సంఘాల నేతల సమక్షంలో సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు.

-మిగతా 2 లో






## ఇమ్రాన్ ఖాన్‌ను ఆస్పత్రిలో చేర్చండి

- ప్రత్యేక వైద్య బోర్డుతో వైద్య పరీక్షలు జరిపించండి
- వారానికోసారి కుటుంబీకులు కలిసేందుకు అనుమతించండి
- పాకిస్తాన్ ప్రభుత్వానికి అక్కడి సుప్రీంకోర్టు ఆదేశం

02



02

## భారత ఎన్నికల వ్యవస్థను ఆదర్శంగా తీసుకోండి..

- అమెరికాలో ఓటర్ ఫొటో ఐడీ తప్పనిసరి చేయాలని సూచన
- 'సేవ్ అమెరికా యాక్ట్'ను ఆమోదించాలని పిలుపు
- భారత ఎన్నికల ప్రక్రియపై ట్రంప్ ప్రశంసలు
- అమెరికా ఎన్నికల్లో పౌరులకే ఓటు హక్కు
- మెయిల్ ఓటింగ్‌పై ఆంక్షలు విధించే ప్రతిపాదన
- జనవరి 29న చట్టసభల్లో బిల్లు ప్రవేశపెట్టిన ప్రభుత్వం

## ఈవీల వాహన కాలం ఐదేండ్లు పొడిగింపు!




02



## బీజేపీ జేబుసంస్థగా కేంద్ర ఎన్నికల సంఘం

- ఇష్టం వచ్చినట్లుగా ఓట్లు తొలగించడం అన్యాయం
- 22శాతం ఓట్ల తొలగింపు దుర్మార్గపు చర్య
- తెలంగాణలో సర్ ప్రక్రియను పొడిగించాలి
- పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్ డిమాండ్

హైదరాబాద్,

2014లో కొలువుదీరిన నాటి నుంచి రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేస్తుందంటూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. ఎన్నికల కమిషన్ కూడా బీజేపీకి అనుబంధ సంస్థగా మారిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం సీబీఐ, ఈడీ తరహాలో ఎన్నికల సంఘాన్ని కూడా తనకు అనుకూలంగా మార్చుకుందని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు.తెలంగాణలో ఎస్ఐఆర్‌కు ఇంకా సమయం ఇవ్వాలని ఈసీని డిమాండ్ చేశారు. అర్హులైన అందరికీ ఓటు

-మిగతా 2 లో

# బిల్లులు చెల్లించకుంటే పదివేల మందితో దీక్ష చేస్తాం

**●రోడ్ల పనుల్లో జాప్యంపై ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఆగ్రహం..**

**●విద్యుత్, మిషన్ భగీరథ సమస్యలపై అధికారులకు ఆదేశాలు**





**మిడ్జిల్, ఆగస్టు 18, (నేటి దర్శని ):**
మిడ్జిల్ మండల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు చొరవ చూపాలని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం మిడ్జిల్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ గత ప్రభుత్వ హయాంలో సర్వసభ్య సమావేశాల్లో సభ్యులను మాట్లాడనీయకుండా మైకులు లాక్కునే పరిస్థితి ఉండేదని ఎమ్మెల్యే విమర్శించారు.నియోజకవర్గంలో పలు రోడ్ల పనులు అసంపూర్తిగా ఉండటంపై సభ్యులు ప్రశ్నించగా.. పనులు పూర్తిచేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు అందకపోవడంతోనే జాప్యం జరుగుతోందని ఎమ్మెల్యే తెలిపారు. కాంట్రాక్టర్లకు బకాయి బిల్లుల నిధులను వెంటనే విడుదల చేయకపోతే పదివేల మందితో దీక్ష చేపడతానని ఇప్పటికే చెప్పానని, మరోసారి ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నానని అన్నారు.విద్యుత్ సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు వెంటనే ప్రతిపాదనలు (ప్రపోజల్స్) సిద్ధం చేసి అందజేయాలని ఆదేశించారు. రాణిపేట, సింగం, దొడ్డి తదితర ప్రాంతాల్లో సబ్‌స్టేషన్ల నిర్మాణానికి సంబంధించిన పెండింగ్ అంశాలను త్వరగా పరిష్కరించాలని సూచించారు. ఇప్పటికే మంజూరైన సబ్‌స్టేషన్లకు వెంటనే టెండర్లు పిలవాలని అధికారులను ఆదేశించారు. మసిగొండ్లపల్లి పరిధిలో ఆరు గ్రామపంచాయతీలకు విద్యుత్ సమస్య పరిష్కారం కోసం సబ్‌స్టేషన్ మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు.మిడ్జిల్, చిల్వేర్ గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న అంగన్‌వాడీ భవనాల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. మండలంలోని ప్రభుత్వ అభివృద్ధి పనులకు ఇసుక కొరత లేకుండా చూడాలని, ఈ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలింపునకు అనుమతులు వచ్చేలా చర్యలు తీసుకుంటానని సర్పంచ్‌లకు తెలిపారు.మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీలపై కూడా ఎమ్మెల్యే తీవ్రంగా స్పందించారు. గ్రామాల్లో లీకేజీలను అధికారులు పట్టించుకోకపోవడంతో సర్పంచ్‌లపై ఆర్థిక భారం పడుతోందని, ప్రజలకు సమాధానం చెప్పలేక వారు అప్పులపాలవుతున్నారని సభ్యులు వివరించారు. మిషన్ భగీరథకు నిధులు అందుబాటులో ఉన్నందున సంబంధిత కాంట్రాక్టర్లతో లీకేజీల మరమ్మతు పనులు వెంటనే చేపట్టించాలని అధికారులను ఆదేశించారు.వివిధ శాఖలకు సంబంధించిన సమస్యలపై ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన అంశాలను అధికారులు వెంటనే పరిష్కరించాలని, పెండింగ్ సమస్యలను కాలయాపన చేయకుండా సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే సూచించారు. కాగా మండల విద్యాశాఖ అధికారి సర్వసభ్య సమావేశానికి హాజరుకాకపోవడంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తానని హెచ్చరించారు.ఈ సమావేశంలో మండల ప్రత్యేక అధికారి విష్ణునందన్, తహసీల్దార్ రాఘవేందర్ రెడ్డి, ఎంపీడీవో లక్ష్మణ్ రాథోడ్, బాదేపల్లి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్

**●జాతీయ ఓబిసి మాజీ మెంబర్ తల్లోజు ఆచారి**



**ఆమనగల్లు, ఆగస్టు18 (నేటి దర్శిని);**
బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని జాతీయ ఓబిసి మాజీ మెంబర్ తల్లోజు ఆచారి అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తల్లోజు ఆచారి హాజరయ్యారు. ఆమనగల్లు పట్టణంలో గౌడ యువజన సంఘం ఆధ్వర్యంలో బహుజన చక్రవర్తి, వీర యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తల్లోజు ఆచారి మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని ఆయన అన్నారు. సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. పాపన్న గౌడ్ ఆశయాలను యువత ముందుకు తీసుకెళ్లాలని ఆచారి పిలుపునిచ్చారు. యువత చరిత్రను తెలుసుకొని, మహనీయుల స్ఫూర్తితో సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. జయంతి సందర్భంగా పాపన్న గౌడ్ సేవలు, ధైర్య సాహసాలను స్మరించుకుంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పత్యానాయక్,కౌన్సిలర్లు ఎర్రవోలు మహేష్,ముక్తాల వెంకటయ్య, కో ఆప్షన్ నెంబర్ చుక్క అల్లాజి గౌడ్, గౌడ సంఘం నాయకులు చుక్క నిరంజన్ గౌడ్,గజ్జ వెంకటయ్య గౌడ్,గంగ రవి గౌడ్, మల్లేష్ గౌడ్,బాలకృష్ణ,తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ స్కూల్ బస్సులను వివాహాలకు వినియోగించొద్దు



**ఆమనగల్లు, ఆగస్టు18 (నేటి దర్శిని):**
ప్రైవేట్ పాఠశాలలకు చెందిన బస్సులను వివాహ వేడుకలు,ఇతర వ్యక్తిగత కార్యక్రమాలకు వినియోగించకుండా చర్యలు తీసుకోవాలని ఆమనగల్లు టూర్స్ అండ్ ట్రావెల్స్ బస్సు అసోసియేషన్ ప్రతినిధులు కోరారు.ఈ మేరకు ట్రస్మా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు వినతిపత్రం అందజేశారు. విద్యార్థుల రవాణా కోసం వినియోగించాల్సిన పాఠశాల బస్సులను ఇతర కార్యక్రమాలకు వినియోగించడం వల్ల తమ వ్యాపారంపై ప్రభావం పడుతోందని అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. వివాహ వేడుకలకు అవసరమైన బస్సులను టూర్స్ అండ్ ట్రావెల్స్ నిర్వాహకుల నుంచి తీసుకునేలా సహకరించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో కల్వకుర్తి తాలూకా ఇన్‌చార్జ్ ఎడ్ల శ్రీశైలం, పాండు, రమేష్, హన్మంతూ, శీను,మహేష్, ధర్మేందర్,వెంకటేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

# ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలు



**పటాన్ చెరు, ఆగస్టు 18 (నేటి దర్శిని):**
సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు మండలం ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రుద్రారం వార్డులో బహుజన విప్లవ వీరుడు, తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కౌన్సిలర్ సందీప్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు, గ్రామస్థులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ సందీప్ గౌడ్ మాట్లాడుతూ, 17వ శతాబ్దంలోనే భూస్వామ్య వ్యవస్థకు, మొఘల్ పాలకుల అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన ధీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని కొనియాడారు. బహుజనులను ఏకం చేసి ఖిలాషాపూర్ కేంద్రంగా స్వయంపాలన సాగించి ప్రజా రాజ్య స్థాపనకు కృషి చేసిన మహనీయుడిగా ఆయనను గుర్తుచేశారు. పాపన్న గౌడ్ ఆశయాలను నేటి తరానికి చేరవేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఆయన చూపిన పోరాట స్ఫూర్తి సమాజానికి మార్గదర్శకమని అన్నారు.ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు ఆనందం, ప్రభు, సతీష్, నరేష్, అరుణ్, శ్రవణ్, శివ, యోగేందర్, రాజేష్, అంజన్న, అరవింద్, దుర్గ గౌడ్, నవీన్, అవినాష్, దిలీప్, స్వామి రాజేష్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక ప్రజలు, యువకులు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేశారు.





# రైతులకు నోటీసులు ఇవ్వకుండా భూసేకరణ ఎలా?

**●రైతుల పక్షాన ఉద్యమం కొనసాగిస్తాం**

**●లక్డారం దళితుల భూములపై అక్రమ భూసేకరణను నిలిపివేయాలి: సీపీఎం నాగేశ్వరరావు**





**పటాన్‌చెరు, ఆగస్టు 18 (నేటి దర్శిని):**
సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం లక్డారం గ్రామంలోని సర్వే నంబర్ 498లో ఉన్న 22 ఎకరాల భూమి విషయంలో వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో మంగళవారం సీపీఎం నాయకులు గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు దళిత రైతులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతుల నుంచి భూములకు సంబంధించిన వివరాలను సేకరించి, వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.లక్డారం గ్రామంలోని దళిత రైతుల భూములపై అధికార యంత్రాంగం చేపడుతున్న భూసేకరణ, ఫెన్సింగ్ పనులను తక్షణమే నిలిపివేయాలని సీపీఎం పటాన్‌చెరు డివిజన్ కార్యదర్శి బి. నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. రైతులకు ఎలాంటి ముందస్తు సమాచారం, నోటీసులు ఇవ్వకుండా పోలీసుల బందోబస్తు మధ్య భూముల్లో పనులు చేపట్టడం చట్టవిరుద్ధమని ఆయన ఆరోపించారు. ఈ సందర్భంగా బి. నాగేశ్వరరావు మాట్లాడుతూ 1970లో అప్పటి ప్రభుత్వం లక్డారం గ్రామానికి చెందిన 25 మంది రైతులకు ఒక్కొక్కరికి ఎకరం చొప్పున భూమిని కేటాయించిందని తెలిపారు. దశాబ్దాలుగా ఆ భూములను రైతులు సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారని చెప్పారు. ప్రస్తుతం ఎస్టీపీ ప్లాంట్ ఏర్పాటులో భాగంగా 10 ఎకరాల భూమిని కేటాయిస్తున్నామని అధికారులు చెబుతున్నారని, అయితే రైతుల భూముల్లోకి వచ్చి ఫెన్సింగ్ పనులు చేపట్టడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

**రైతులకు నోటీసులు ఇవ్వకుండా భూసేకరణ ఎలా?**

భూసేకరణ ప్రక్రియలో భాగంగా ముందుగా సంబంధిత భూ యజమానులకు నోటీసులు ఇవ్వాలని, భూముల స్వాధీనానికి సంబంధించిన పూర్తి వివరాలను తెలియజేయాలని నాగేశ్వరరావు అన్నారు. గ్రామసభ నిర్వహించి ప్రజల అభిప్రాయాలను తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అయితే లక్డారం విషయంలో ఇవేవీ పాటించకుండా నేరుగా పోలీసు బలగాలను మోహరించి ఫెన్సింగ్ పనులు చేపట్టడం దౌర్జన్యంగా వ్యవహరించడమేనని విమర్శించారు. వందలాది మంది పోలీసులను గ్రామంలో మోహరించి రైతులను భయభ్రాంతులకు గురిచేస్తూ వారి భూముల్లోకి వెళ్లడం ప్రజాస్వామ్య పద్ధతి కాదన్నారు. రైతులతో చర్చలు జరిపి, వారి అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే ఏదైనా నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**హైకోర్టులో కేసు కొనసాగుతుండగా తొందరపాటు ఎందుకు?**

లక్డారం రైతుల భూ సమస్యపై ఇప్పటికే హైకోర్టులో కేసు కొనసాగుతోందని నాగేశ్వరరావు తెలిపారు. ఈ నెల 20న ఈ కేసుపై విచారణ జరగనున్న నేపథ్యంలో అధికారులు అత్యవసరంగా ఫెన్సింగ్ పనులు చేపట్టాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. కోర్టు విచారణ పూర్తయ్యే వరకు భూముల్లో ఎలాంటి పనులు చేపట్టకుండా యథాతథ స్థితిని కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం ప్రభుత్వ అవసరాల కోసం ప్రైవేటు భూములను సేకరించాల్సి వస్తే చట్టబద్ధమైన ప్రక్రియను పూర్తిగా పాటించాల్సి ఉంటుందని తెలిపారు. భూ యజమానులకు నోటీసులు జారీ చేయడం, అభ్యంతరాలను స్వీకరించడం, గ్రామసభ నిర్వహించడం, భూముల విలువను నిర్ధారించడం, అర్హులైన రైతులకు చట్టప్రకారం పరిహారం అందించడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు.అయితే లక్డారం గ్రామంలో ఈ ప్రక్రియను పక్కనపెట్టి రెవెన్యూ అధికారులు, పోలీసుల సహకారంతో రైతుల భూముల్లో పనులు చేపట్టడం అన్యాయమని ఆయన అన్నారు. దళిత రైతుల భూముల విషయంలో అధికారులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

**రైతుల పక్షాన ఉద్యమం కొనసాగిస్తాం**

లక్డారం దళిత రైతులకు న్యాయం జరిగే వరకు సీపీఎం వారి పక్షాన నిలబడి పోరాటం కొనసాగిస్తుందని నాగేశ్వరరావు స్పష్టం చేశారు. రైతుల భూములను రక్షించేందుకు రాజకీయ పార్టీలు, దళిత ప్రజా సంఘాలు, రైతు సంఘాలు, ప్రజాసంఘాలను ఏకతాటిపైకి తీసుకువచ్చి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. రైతుల సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, భూసేకరణ ప్రక్రియపై సమగ్ర విచారణ చేపట్టాలని, కోర్టు విచారణ పూర్తయ్యే వరకు ఫెన్సింగ్ మరియు ఇతర పనులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. భూములను కోల్పోయే పరిస్థితి ఏర్పడితే రైతుల జీవనోపాధి దెబ్బతింటుందని, వారి హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.ఈ కార్యక్రమంలో లక్డారం గ్రామ రైతులు కే. మల్లేష్, మాణిక్ ప్రభు, లక్ష్మయ్య, బలరాం, జీవన్‌కుమార్, రవి, శ్రీనివాస్, వెంకటమ్మ, నవనీత, అంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## సంపాదకీయం

# సప్తధార' సాకారమైతేనే ప్రగతి



ఆగస్టు 15న ఢిల్లీ ఎర్రకోటపై ప్రధాని మోడీ 13వ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగం ఈసారి ఎలా ఉంటుందో అని అందరూ ఆసక్తిగా నిరీక్షించారు. కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు దారితీసిన కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) ఆందోళనల తరువాత, ప్రభుత్వం అనుసరించే సాధారణ వైఖరి ఏమిటో ఈ ప్రసంగంద్వారా అంచనా వేయాలని భావించారు. సిజెపి, జెన్‌జెడ్ నిరసనలు, వాటికి దారితీసిన అంతర్లీన కారణాలు, ఇంకా కొనసాగుతున్న అసంతృప్తి, దేశానికి తీవ్రమైన ఆందోళన కలిగించే అంశాలు గానే మిగిలాయి. 75 నిమిషాల ఆయన ప్రసంగంలో రెండు ప్రధాన అంశాలు స్పష్టంగా కనిపించాయి. మొదటిది వామపక్షాలు, ఉద్యమ కార్యకర్తలు, వామపక్ష సిద్ధాంత మేధావులపట్ల ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోవడానికి సిద్ధంగా లేదనే సంకేతం అందించారు. సాయుధ నక్సలైట్లను ఓడించినా, నక్సలైట్ భావజాలం ఇంకా మిగిలే ఉందన్నారు. ఈ సందర్భంగా 'దిమాగీ నక్సల్స్ ' అనే కొత్త భూతాన్ని తెరపైకి తెచ్చారు. అలాంటి వ్యక్తులను వ్యవస్థ నుంచి ప్రక్షాళన చేయవలసిన అవసరం ఉందన్నారు. ఈ శక్తులు అవకాశాల కోసం చూస్తున్నాయని, హింస, అరాచకానికి దారితీసే మార్గాలను అన్వేషిస్తూ సమాజాన్ని తప్పుదారి పట్టించేందుకు వివిధ వ్యూహాలను అవలంబిస్తున్నాయని హెచ్చరించారు. మరోవైపు యువత ముఖ్యంగా నిరుద్యోగ యువతకు ఆశలు కలిగించేలా సప్తధార పేరున ఏడు ప్రధాన లక్షాలను వెల్లడించారు. ఈ ప్రసంగం ప్రత్యేకంగా దేశంలోని యువ పౌరులను ఉద్దేశించి చేసింది. పెద్ద కలలు కనడం, దృఢమైన సంకల్పంతో ముందుకు సాగడం, వేగంగా అమలు చేయడం అవసరమని స్పష్టం చేశారు. దేశాన్ని కృత్రిమ మేధస్సు (ఎఐ) యుగానికి సిద్ధం చేయడానికి వచ్చే ఏడాదిలో ఒక కోటి మంది యువతకు నైపుణ్య శిక్షణ అందిస్తామని హామీ ఇచ్చారు. కుటుంబాలపై ఆర్థిక భారాన్ని తగ్గించి ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు అందేలా పోటీ పరీక్షలకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ అందిస్తామన్నారు. అలాగే ఆవిష్కరణలు, క్వాంటమ్ టెక్నాలజీ, అంతరిక్ష రంగం, రోబోటెక్స్, డేటా సెంటర్లు వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రక్షణ పరికరాల ఉత్పత్తిలో భారత్‌ను స్వావలంబన దిశగా తీసుకెళ్లాలనే తన నిబద్ధతను పునరుద్ఘాటించారు. ఇందులో డ్రోన్లు, తదుపరి తరం రక్షణ వ్యవస్థలు వంటి అత్యంత ఆధునిక సాంకేతికతల అభివృద్ధి కూడా భాగమని పేర్కొన్నారు. ఈ హామీలు భవిష్యత్‌పై స్పష్టమైన లక్షాలుగా, దేశాన్ని ముందుకు తీసుకెళ్లాలన్న సంకల్పాన్ని ప్రతిబింబిస్తోందని, ప్రతి భారతీయుడు సహజంగానే అభినందిస్తారు. అయితే ఈ లక్షాలను, సవాళ్లను అధిగమించడానికి సమగ్రమైన జాతీయ విధానాన్ని రూపొందించాలని ప్రధాని మోడీ కోరుకున్నారా లేదా అందుకు ప్రయత్నించారా అన్నది సందేహాస్పదమే.

దేశంలో అభివృద్ధి అన్నది నిరంతర ప్రక్రియ. ప్రతి సంవత్సరం సాధించిన పురోగతి, తరువాతి సంవత్సరాల్లో మరింత వేగంగా పెరుగుతూ, సమ్మిళిత ప్రభావాన్ని చూపించగలగాలి. 2014లో ప్రధానమంత్రిగా మోడీ బాధ్యతలు చేపట్టడానికి ముందు, తరువాత సాధించిన విజయాలను కేవలం సంపూర్ణ సంఖ్యల ఆధారంగా సరిపోల్చడం గణాంకపరంగా అంత సముచితం కాదు. రాజకీయంగా కూడా అది వివేక బద్ధతను ప్రశ్నిస్తుంది. బ్రిటిష్ వలస పాలనను ఎదుర్కొని భారత్ ఇప్పుడు స్వతంత్ర దేశంగా 80వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న తరుణంలో ఇది వరకటి కన్నా మునుపెన్నడూ లేని అసాధారణమైన సవాళ్లు ఎదురవుతున్నాయి. ఒకవైపు భారీ సంఖ్యలో యువజనాభా ఉపాధి రంగంలోకి ప్రవేశిస్తోంది. మరోవైపు సాంకేతిక పరిజ్ఞానం గతంలో ఎన్నడూ లేనంతగా మన జీవన విధానాన్ని, పనితీరును మార్చివేస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో భారత దేశానికి అందరూ కలిసికట్టుగా పనిచేసే సమగ్ర విధానం అత్యంత అవసరం. ఎన్నికల్లో గెలవడానికి పోటాపోటీలు, రాజకీయ ప్రయోజనాలు, వీటన్నిటికి అతీతంగా అన్ని రాజకీయ పార్టీలు, వర్గాల మధ్య ఏకాభిప్రాయంతో కూడిన రాజకీయ సంకల్పం అవసరం. దేశం ఎదుర్కొంటున్న ఈ అసాధారణ సవాళ్లను అధిగమించడానికి, అందరూ ఒకే దిశగా, అన్ని చేతులూ కలిసి పనిచేసే విధానం చాలా ముఖ్యం.

# ఆగస్టు 28 నుంచి ఫ్రీడం ఆఫ్ రిలీజియన్ యాక్ట్..

### మతమార్పిడులు నిరోధించేందుకేనన్న ప్రభుత్వం

**న్యూఢిల్లీ, ఆగస్టు 18: (నేటి దర్శిని)** బలవంతపు మత మార్పిడులను అడ్డుకునేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం కొత్త చట్టాన్ని అమలు చేయనుంది. 'ద మహారాష్ట్ర ఫ్రీడం ఆఫ్ రిలీజియన్ యాక్ట్, 2026' పేరుతో రూపొందిన ఈ చట్టం ఆగష్టు 28 నుంచి అమలులోకి రానుంది. రాష్ట్ర వ్యాప్తంగా అమలు కానున్న ఈ చట్టంపై ప్రభుత్వం అధికారిక గెజిట్ విడుదల చేసింది. ఈ చట్టం గురించి ప్రభుత్వం చెబుతున్న వివరాల ప్రకారం రాష్ట్రంలో బలవంతపు మత మార్పిడులను ఈ చట్టంతో నిరోధించవచ్చు. ఒక వ్యక్తిని బలవంతంగా మతం మార్చడానికి ప్రయత్నించడం, లేదా అబద్ధపు హామీతో వేరే మతంలోకి మారేలా చేయడం, మతం మార్చే విషయంలో బలవంత పెట్టడం, అనుచితంగా ప్రవర్తించడం వంటివి ఈ కొత్త చట్ట ప్రకారం తీవ్రమైన



నేరాలు. ఈ నేరానికిగాను గరిష్టంగా 7 సంవత్సరాల వరకు జైలు శిక్ష విధిస్తారు. గరిష్టంగా రూ.5 లక్షల జరిమానా కూడా విధిస్తారు. ఇందులో సాధారణ వ్యక్తుల్ని బలవంతంగా మతం మార్చితే రూ.1 లక్ష జరిమానా ఉంటుంది. అదే, మైనర్ లేదా మానసిక రుగ్మతలు ఉన్నవారిని, ఎస్సీ, ఎస్టీలను మతం మార్చితే మాత్రం రూ.5 లక్షల వరకు జరిమానా, జైలు శిక్ష ఉంటుంది. అలాగే, ఇది నాన్ బెయిలబుల్ కేసుగా పరిగణిస్తారు. ఈ బిల్లును మహారాష్ట్ర అసెంబ్లీ ఇటీవలే అమోదించింది. అయితే, ఈ బిల్లును పలు సంస్థలు, సంఘాలు వ్యతిరేకించాయి. ఈ చట్టం తేవడమంటే ప్రజల వ్యక్తిగత స్వేచ్ఛ విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకోవడమే అని విమర్శించాయి. కానీ, ఈ విమర్శల్ని మహారాష్ట్రలోని కూటమి ప్రభుత్వం తిప్పికొట్టింది. బలవంతంగా మతం మార్చడాన్ని, ప్రేమ, పెళ్లి పేరుతో మతం మార్చేందుకు ప్రయత్నించడాన్ని, మోస పూరితంగా మతం మార్చడాన్ని నియంత్రించేందుకే ఈ చట్టం తెచ్చామని ప్రభుత్వం చెప్పింది. ఈ చట్టం ప్రకారం ఎవరైనా తమ ఇష్టానుసారం మతం మారాలి అనుకుంటే ఇందుకోసం సంబంధిత వ్యవస్థ వద్ద దరఖాస్తు చేసుకోవాలి. అది కూడా 60 రోజుల ముందుగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ చట్టంలో కీలమైంది పిల్లలకు తల్లి మతం వర్తించడం. వేరే మతం వ్యక్తిని పెళ్లి చేసుకుని, ఇంకో మతంలోకి మారితే.. పుట్టే పిల్లలకు తల్లి మతమే వర్తిస్తుంది. చట్ట వ్యతిరేకంగా, చట్టంతో సంబంధం లేకుండా ఎవరైనా వేరే మతంలోకి మారినప్పుడు వారి పిల్లలకు ఈ రూల్ వర్తిస్తుంది. ఇది పెళ్లైన వారికి లేదా రిలేషన్‌లో ఉన్న వారికి కూడా. ఈ చట్టం అన్ని మతాల వారికి సమానంగా వర్తిస్తుంది.

# ఉరిశిక్షను రద్దు చేయండి

### -ఇతర సులువైన మరణాలను ప్రసాదించండి
### -సుప్రీంలో దాఖలైన పిటిషన్ కొట్టివేత


**న్యూఢిల్లీ, ఆగస్టు 18: (నేటి దర్శిని)** మరణశిక్ష పడిన దోషులను ఉరిశిక్ష నుంచి తప్పించి, సులువుగా మరణించే ప్రక్రియను చేపట్టాలని కోరుతూ దాఖలైన పిల్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. భారతీయ శిక్షా స్మృతిలో భాగంగా కొన్ని కేసుల్లో ఉరి తీస్తున్న విషయం తెలిసిందే. అయితే ఉరి వేసి దోషిని చంపే ప్రయత్నాలను ఆపేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిల్ దాఖలైంది. ఉరికి బదులుగా, మరేదైనా నొప్పిలేని విధానాన్ని అమలు చేయాలని కోరుతూ దాఖలైన పిల్‌ను సుప్రీంకోర్టు కొట్టిపారేసింది. జస్టిస్ విక్రమ్ నాథ్, సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం ఈ తీర్పును ఇచ్చింది. కాలం చెల్లిన ఉరి విధానాన్ని బహిష్కరించి, దాని స్థానంలో నొప్పి లేకుండా మరణశిక్షను అమలు చేసే విధానాన్ని ప్రవేశపెట్టాలని కోరుతూ సుప్రీంలో పిటీషన్ దాఖలైంది. అయితే ఆ పిటీషన్‌ను అత్యున్నత



న్యాయస్థానం తిరస్కరించింది. ఇక ఈ కేసులో ఇదే తుది తీర్పు కాదని, భవిష్యత్తులో ఈ అంశాన్ని మళ్లీ ప్రస్తావించవచ్చు అని, ఒకవేళ ప్రత్యామ్నాయ మరణాలపై ఏవైనా శాస్త్రీయ ఆధారాలు ఉంటే, దాని ప్రకారం మరణశిక్షను అమలు చేయవచ్చని కోర్టు తన తీర్పులో అభిప్రాయపడింది. ప్రస్తుతం రిట్ పిటీషన్‌ను డిస్మిస్ చేస్తున్నామని, కానీ భవిష్యత్తులో రాజ్యాంగం ధర్మాసనం ఈ విధానంపై సమీక్ష నిర్వహించే అవకాశం ఉంటుందని కోర్టు తెలిపింది. శాస్త్రీయ విధానాల్లో మరణశిక్షను అమలు చేసే అంశంలో కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని స్వేచ్ఛగా తీసుకోవచ్చని కోర్టు అభిప్రాయపడింది. సీనియర్ న్యాయవాది రిషి మల్హోత్రా 2017లో ఈ పిల్ దాఖలు చేశారు. సీఆర్పీసీలోని సెక్షన్ 354(5) కింద ఉరి ద్వారా మరణశిక్షను అమలు చేసే వారు. అయితే ఆ సెక్షన్‌ను సవాల్ చేస్తూ కోర్టులో పిటీషన్ వేశారు. మరణశిక్ష అమలులో భాగంగా ఉరికి బదులుగా ప్రాణాంతక ఇంజెక్షన్ ఇవ్వాలని పిటీషనర్ అభిప్రాయపడ్డారు. అనేక దేశాలు ఉరి తీయడానికి బదులుగా ప్రత్యామ్నాయ రీతిలో మరణశిక్షలను అమలు చేస్తున్నాయన్నారు. మరణశిక్ష అమలు రీతిలపై ప్రభుత్వం ఉన్నత స్థాయిలో చర్చిస్తున్నట్లు అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి తెలిపారు. విషపూరిత ఇంజెక్షన్ ద్వారా మరణశిక్ష అమలు చేసే విధానం విజయవంతంగా జరగడంలేదని సీనియర్ న్యాయవాది మీనాక్షి ఆరోరా వాదించారు. ఈ అంశంలో కమిటీని ఏర్పాటు చేయాలని ఆ న్యాయవాది కోరారు.

# టిస్' స్నాతకోత్సవానికి సీజేఐ స్థానంలో మరొకరు

**న్యూఢిల్లీ, ఆగస్టు 18: (నేటి దర్శిని)** ఈ నెల 22న జరగనున్న టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్(టిస్) 86వ స్నాతకోత్సవానికి టాటా మెమోరియల్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ సీఎస్ ప్రమేష్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్టు ఆ సంస్థ ప్రకటించింది.






అంతకు మందు ఆగస్టు 2న నిర్వహించ తలపెట్టిన స్నాతకోత్సవానికి భారత ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ ముఖ్య అతిథిగా హాజరు కావాల్సి ఉంది.అయితే సీజేఐ వస్తే విద్యార్థుల నుంచి నిరసనలు తలెత్తవచ్చనే భావనతో వర్సిటీ అధికారులు స్నాతకోత్సవాన్ని వాయిదా వేశారు. కాగా ఆగస్టు 22న జరిగే స్నాతకోత్సవానికి జస్టిస్ సూర్యకాంత్ హాజరు కాలేరని, నవంబర్ వరకు ఆయన షెడ్యూల్ బిజీగా ఉందని సీజేఐ కార్యాలయం తెలిపి

# మహాత్ముడిపైనా కేసులు పెట్టండి

### -బీజేపీకి ఖర్గే సవాల్




**న్యూఢిల్లీ, ఆగస్టు 18: (నేటి దర్శిని)** న్యూఢిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో, ఆ తర్వాత గోవాలో జరిగిన పార్టీ కార్యక్రమంలోనూ వందేమాతరం గేయాలాపనకు సంబంధించి వివాదాలు కొనసాగుతున్న తరుణంలో పార్టీ నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై దాఖలైన ఫిర్యాదులోని ప్రాతిపదికను కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మంగళవారం ప్రశ్నించారు.జాతీయ గేయాన్ని దాని పూర్వ రూపంలో పాడటం నేరమైతే మహాత్మా గాంధీతోపాటు మాజీ ప్రధానులు జవహర్‌లాల్ నెహ్రూ, అటల్ బిహారీ వాజ్‌పేయిలపై కూడా ఫిర్యాదులు నమోదు చేయాలని ఆయన సవాలు విసిరారు. శనివారం పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలో జాతీయ గేయాన్ని పూర్తి స్థాయిలో ఆలపించడాన్ని ఆపాలని కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీ సంకేతాలు ఇచ్చారని ఆరోపిస్తూ బీజేపీ ఆమెపై ఆరోపణలు చేసిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి.

# హర్మూజ్ జలసంధి అమెరికాలో భాగం..

### ఫొటో రిలీజ్ చేసిన డొనాల్డ్ ట్రంప్

**న్యూఢిల్లీ, ఆగస్టు 18: (నేటి దర్శిని)** హర్మూజ్ జలసంధి పై పూర్తి నియంత్రణ తమకే ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. ఈ క్రమంలోనే తాజాగా 'ట్రూత్ సోషల్ వేదికగా కీలక పోస్టు పెట్టారు. 'హర్మూజ్.. అమెరికా కొత్త ప్రదేశం' అని ఆ జలసంధి మ్యాప్‌పై రాసి ఉన్న ఫొటోను ఆయన షేర్ చేశారు. ప్రస్తుతం హర్మూజ్‌ను దిగ్బంధనం చేసిన అమెరికా.. ఇరాన్ నౌకలను అడ్డుకుంటున్నది.మరోవైపు.. తమ డిమాండ్లు నెరవేర్చే వరకు హర్మూజ్‌పై పట్టును కొనసాగిస్తామని ఇరాన్ పార్లమెంటరీ స్పీకర్ మహమ్మద్ బాఘేర్ గాలిబాఫ్ మంగళవారం స్పష్టంచేశారు. 'ఒప్పందం ప్రకారం దిగ్బంధనాన్ని ఎత్తేయాలి. స్తంభింపజేసిన ఆస్తులను విడుదల చేయాలి. చమురుపై ఆంక్షలను తొలగించాలి. అదేవిధంగా సైనిక చర్యలకు ముగింపు





పలకాలి. అప్పటివరకు హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవబోం' అని స్పష్టంచేశారు. కాగా ప్రస్తుతం ఇరాన్‌తో చర్చలు, సంప్రదింపులేవీ జరగడం లేదని ట్రంప్ స్పష్టంచేశారు. ఇరాన్ నౌకల విషయంలో దిగ్బంధనం పూర్తిస్థాయిలో కొనసాగుతోందని తెలిపారు. హర్మూజ్ జలసంధి తెరిచే ఉందని చెప్పారు. సముద్ర జలాల్లో ఇరాన్ అమర్చిన పేలుడు పదార్థాలను తొలగించామని, కొన్నింటిని పేల్చివేశామని 'ట్రూత్ సోషల్' వేదికగా ట్రంప్ ప్రకటించారు.

## అనుమతులు లేకుండా మద్యం తరలిస్తున్న వాహనం సీజ్‌కు ఆదేశం





**మిడ్జిల్, ఆగస్టు 18, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** గ్రామంలో పర్యటిస్తున్న సమయంలో అనుమతులు లేకుండా మద్యం తరలిస్తున్న వాహనాన్ని కలెక్టర్ గుర్తించారు. గ్రామంలోని బెల్ట్‌షాపులకు అనధికారికంగా మద్యం విక్రయిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. దీంతో ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, వాహనాన్ని స్వాధీనం చేసుకోవాలని సంబంధిత ఎక్సైజ్ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.అలాగే, అక్రమ మద్యం విక్రయాలకు సంబంధించి బాధ్యులైన మద్యం దుకాణం లైసెన్స్‌ను రద్దు చేయాలని ఆదేశించారు.ఈ తనిఖీల్లో మహబూబ్‌నగర్ రూరల్ తహసీల్దార్, ఎం.పి.డి. ఓ , ఎం.పి. ఓ తదితర అధికారులు పాల్గొన్నారు.

## వార్డుని పరిశుభ్రంగా ఉంచుదాం

- 9వ వార్డు కౌన్సిలర్ ఎర్రవోలు మహేష్



**ఆమనగల్లు, ఆగస్టు18(నేటి దర్శిని);** రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డుని పరిశుభ్రంగా ఉంచుదామని వార్డు కౌన్సిలర్ ఎర్రవోలు మహేష్ అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పారిశుద్ధ్య సిబ్బందితో వార్డు లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తీసి వేస్తూ, ముళ్ళ పొదలను,పిచ్చి చెట్లను,దగ్గరుండి తీసి తీసివేయించారు. కాలనీవాసులకు ఎర్రవోలు మహేష్ పలు సూచనలు చేశారు. కాలనీలో మున్సిపాలిటీ చెత్తబల్ల లో చెత్తను వేయాలని,తడి చెత్తను పొడి చెత్తను వేరు చేస్తూ మున్సిపాలిటీ చెత్త ఆటోబండ్లలో వేయాలని సూచించారు. చెత్తను బయట రోడ్ల పైన వేయకుండా ఒక దగ్గర డస్ట్ బిన్ లలో పోగు చేసి మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బందికి అందించాలన్నారు.కాలనీలో ఏవైనా సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకురావాలని ఎర్రవోలు మహేష్ అన్నారు.'

## బాలానగర్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ డి.జానకి




**మిడ్జిల్, ఆగస్టు18 (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ మంగళవారం బాలానగర్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో స్టేషన్ హౌస్ ఆఫీసర్ ( ఎస్ హెచ్ ఓ ) విధులు, కేసుల దర్యాప్తు, పెండింగ్ కేసుల పురోగతి, ఫిర్యాదుల స్వీకరణ, స్టేషన్ రికార్డుల నిర్వహణ, బీట్ వ్యవస్థ, నేర నియంత్రణ చర్యలు తదితర అంశాలను ఎస్పీ పరిశీలించారు. స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలు, నేర నియంత్రణ, రాత్రి గస్తీ, బీట్ పోలీసింగ్, అనుమానితులపై నిఘా తదితర అంశాలపై ఎస్ హెచ్ ఓ తో సమీక్షించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సత్వరం స్వీకరించి, చట్టప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జాతీయ రహదారి--44 ( చీఎ-44) ఉండటంతో పాటు బాలానగర్ ఫ్లైఓవర్ నిర్మాణ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో, వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎస్పీ ూనూను ఆదేశించారు. నిర్మాణ పనుల కారణంగా నిరంతరం ట్రాఫిక్ జామ్ ఏర్పడకుండా ట్రాఫిక్ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అవసరమైన చోట పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించాలని సూచించారు. పీక్ అవర్స్‌లో ట్రాఫిక్ రద్దీని ముందుగానే గుర్తించి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని, అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు, ఫైర్ వాహనాలు తదితర అత్యవసర సేవల వాహనాలకు ఎలాంటి ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అలాగే మైనర్ల డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవింగ్, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలు, అధిక వేగం, తప్పుదారి ప్రయాణం తదితర వాటిపై ప్రత్యేక నిఘా ఉంచి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. కేసుల దర్యాప్తులో నాణ్యత, వేగం పెంచి పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని, కోర్టు కేసుల్లో సమర్థవంతమైన ఫాలోఅప్ కొనసాగించాలని ఎస్పీ ఆదేశించారు. మహిళలు, పిల్లల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ నియంత్రణతో పాటు శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ అధికారులను ఆదేశించారు.

## గ్రామపంచాయతీ,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్ ఖుష్బూ గుప్తా





- రికార్డుల నిర్వహణలో లోపాలు, నిధుల దుర్వినియోగం గుర్తింపు
- పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్‌కు ఆదేశం



**మిడ్జిల్, ఆగస్టు18 (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** మహబూబ్‌నగర్ రూరల్ మండలం గాజులపేట గ్రామపంచాయతీ కార్యాలయం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలోని రికార్డులను పరిశీలించిన కలెక్టర్, గ్రామపంచాయతీ తీర్మానం లేకుండానే నిధులు వినియోగించినట్లు గుర్తించారు. అలాగే, పంచాయతీ కార్యదర్శి చూపించిన కొన్ని తీర్మానాలు నకిలీవి గా ఉన్నట్లు పరిశీలనలో తేలింది. రికార్డుల నిర్వహణకు సంబంధించిన పత్రాలు కూడా సక్రమంగా లేవని కలెక్టర్ గుర్తించారు. దీంతో గాజులపేట పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామ పంచాయతీ నిధుల వినియోగం, రికార్డుల నిర్వహణలో నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. దోమల నివారణ కోసం వినియోగించే ఫాగింగ్ మిషన్ల వివరాలు, వాటి సంఖ్య, నిర్వహణకు సంబంధించిన రిజిస్టర్లను కూడా ఆమె పరిశీలించారు.

అనంతరం గాజులపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. అక్షయపాత్ర ద్వారా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం 10వ తరగతి గదిని సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ప్రస్తుతం ఏ పాఠ్యాంశం జరుగుతోందని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు బయాలజీ చదువుతున్నామని తెలపగా, చదువు ఎలా సాగుతోంది, ఉపాధ్యాయులు పాఠాలను బాగా బోధిస్తున్నారా, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని కలెక్టర్ ఆరా తీశారు. పాఠశాలలో విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లు, లైట్లు అందుబాటులో ఉన్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి తరగతి గదిలో ఫ్యాన్లు, లైట్లు తప్పనిసరిగా ఉండేలా చూడాలని, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నాణ్యమైన విద్య అందించాలని పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు.

## అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదు: ఎమ్మెల్యే జిఎంఆర్

- పనులు ప్రారంభించని కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలి
- సెప్టెంబర్‌లో పోచారం, లకడారం సబ్‌స్టేషన్ల ప్రారంభం
- రూ.75 కోట్ల అభివృద్ధి పనులపై సమీక్ష



**పటాన్ చెరు, ఆగస్టు18 (నేటి దర్శిని):** సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో జాప్యాన్ని ఎంతమాత్రం సహించబోమని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి (జిఎంఆర్) స్పష్టం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. పనులు ప్రారంభించకుండా కాలయాపన చేస్తున్న కాంట్రాక్టర్లపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని సూచించారు.మంగళవారం పటాన్‌చెరు డివిజన్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి సమీక్షా సమావేశానికి ఎమ్మెల్యే జిఎంఆర్ అధ్యక్షత వహించారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీలు, విద్యుత్, విద్య, నీటిపారుదల, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, జాతీయ రహదారుల సంస్థ తదితర శాఖల అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్షించారు.ఇంద్రేశం, ఇస్నాపూర్, జిన్నారం, గుమ్మడిదల, గడ్డపోతారం మున్సిపాలిటీల పరిధిలో సుమారు రూ.75 కోట్లతో కొనసాగుతున్న పనుల పురోగతిని పరిశీలించారు. ప్రతి పనికి గడువు నిర్ణయించి, నిర్ణీత సమయంలోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.

**పనులు ప్రారంభించని కాంట్రాక్టర్లపై ఆగ్రహం**

టెండర్లు పూర్తయినప్పటికీ పనులు ప్రారంభించకుండా జాప్యం చేస్తున్న కాంట్రాక్టర్లపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల కోసం మంజూరైన నిధులు కార్యాలయాల ఫైళ్లకే పరిమితం కాకుండా అభివృద్ధి పనుల రూపంలో ప్రజలకు చేరాలని అన్నారు. అవసరమైతే పనులు చేపట్టని కాంట్రాక్టర్ల స్థానంలో కొత్తవారిని ఎంపిక చేసి పనులను వెంటనే ప్రారంభించాలని సూచించారు.

**పారిశుద్ధ్యం, మంచినీరు, విద్యుత్‌కు ప్రాధాన్యత**

అమీన్పూర్, పటాన్‌చెరు సర్కిళ్ల పరిధిలో పారిశుధ్య పరిస్థితులపై ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. చెత్త సేకరణ, తరలింపులో నిర్లక్ష్యం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. శానిటేషన్ సిబ్బంది, డిప్యూటీ కమిషనర్లు ప్రతిరోజూ క్షేత్రస్థాయిలో పర్యటించి పారిశుధ్య పనులను పర్యవేక్షించాలని సూచించారు. నూతన కాలనీలు, బస్తీల్లో వీధిదీపాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, పనిచేయని లైట్లను మరమ్మతు చేయడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో కొత్త వీధిదీపాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

**కొత్త కాలనీలకు మౌలిక వసతులు**

ఇంద్రేశం, ఇస్నాపూర్, జిన్నారం, గుమ్మడిదల, గడ్డపోతారం ప్రాంతాల్లో వేగంగా విస్తరిస్తున్న నూతన కాలనీలకు మంచినీరు, విద్యుత్, రహదారులు, డ్రైనేజీ, యూజీడీ, పారిశుధ్యం వంటి మౌలిక వసతులు కల్పించడంలో జాప్యం చేయకూడదన్నారు. ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలో చెరువుల అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించాలని అధికారులను ఆదేశించారు.

**సెప్టెంబర్‌లో సబ్‌స్టేషన్ల ప్రారంభం**

పటాన్‌చెరు రెవెన్యూ పరిధిలోని పోచారం, లకడారం ప్రాంతాల్లో నిర్మించిన నూతన విద్యుత్ సబ్‌స్టేషన్లను సెప్టెంబర్‌లో ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో లో-వోల్టేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు.

**క్షేత్రస్థాయిలో పర్యటించాలి**

అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుని పరిష్కరించాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రజలకు అత్యవసరమైన విద్యుత్, మంచినీరు, పరిశుభ్రత అంశాలకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు.ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్లు, డిప్యూటీ కమిషనర్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, విద్యుత్, ఇంజనీరింగ్, నీటిపారుదల, విద్య తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఘనంగా ఉచిత నోట్ పుస్తకాల పంపిణీ...

**పటాన్ చెరు, ఆగస్టు 18 (నేటి దర్శిని):** సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రభుత్వం తరఫున విద్యార్థులకు ఉచిత నోట్ పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కళాశాల ప్రధానాచార్యులు ఆర్. వేంకటేశ్వరరావు అధ్యక్షత వహించగా, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రధానాచార్యులు ఆర్. వేంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తూ పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. చదువుకు అవసరమైన సహాయ సహకారాల్లో భాగంగా ప్రభుత్వం అందజేస్తున్న ఉచిత





నోట్ పుస్తకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ప్రభుత్వం అందిస్తున్న విద్యా వనరులను జాగ్రత్తగా వినియోగించుకోవడంతో పాటు, క్రమశిక్షణతో చదివి వార్షిక పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించాలని, కళాశాలకు మరియు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.అనంతరం అధ్యాపకులు మాట్లాడుతూ విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా తమ లక్ష్యాల సాధన దిశగా పట్టుదలతో చదవాలని సూచించారు.ఉచిత నోట్ పుస్తకాలను అందుకున్న విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం, కళాశాల యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల సీనియర్ అధ్యాపకులు బి. అపర్ణ, డా. విటోభా, అధ్యాపకులు డా. ఉషాకుమారి, డా. మహిపాల్, డా. అనూష, ధన్‌రాజ్, సైదులు, దత్తు తదితరులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# కామాంధుడికి కేరాఫ్ అడ్రస్ తెలుగు లెక్చరర్ భాస్కర్?!!

- డి.వి.కె ప్రభుత్వ బాలికల కళాశాలలో భాస్కర్ లీలలు!
- దేహ శుద్ధి చేసిన విద్యార్థులు, స్థానికులు
- అధ్యాపక వృత్తికి కలంకం!... ఉద్యోగం ఉందని అమర్యాదగా ప్రవర్తిస్తే ఊరుకోం విద్యార్థి సంఘాల హెచ్చరిక
- దాదాపు 2 సంవత్సరాల నుంచి అమాయక ఆడపిల్లలను వేధింపులు?!
- నీ మీద ఫీలింగ్స్ వస్తున్నాయి.. నీ***వచ్చిందాయా?
- అదుపులోకి తీసుకున్న పోలీసులు
- తల్లిదండ్రులు ఏబీవీపీ విద్యార్థిని సంఘాలు కళాశాల గేటు ముందు బైఠాయింపు
- తెలుగు ఆధ్యాత్మికుని పై ఫోక్సో కేసు నమోదు చేయాలి అనీ డిమాండ్





**దేవరకొండ, ఆగస్టు 17 ( నేటి దర్శిని):** ధర్మం నాలుగు పాదాలు నడవాలన్నా విద్యయే అన్నిటికి మూలం. గురువుని దైవంతో పోలుస్తారు. తరువాతనే దైవానికి ప్రాధాన్యతనిస్తారు. విద్యాలయాలు అంటే ఆలయాలు అని అర్థం. ఆలయంలోనే అపస్థితి జరిగితే ఇంకేముంది గురువు అని కూడా చూడరు. విద్యను బోధించే ఉపాధ్యాయులు వింత పశువుగా ప్రవర్తిస్తే దేహశుద్ధి చేయక దేవుడిలా పూజిస్తారా?!. వివరాల్లోకెళితే దేవరకొండ స్థానిక కేంద్ర పరిధిలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో తెలుగు లెక్చరర్ భాస్కర్ బాధ్యతలు మరిచి బలాదూర్ గా తయారయ్యాడు. పాఠాలు బోధించేవారు, పాఠాలు చెప్పే విధంగా ప్రవర్తించాలి. మదమెక్కిన మధుప్ప ఏనుగుల ప్రవర్తించడం అసభ్యకరం. సరస్వతి ఆలయానికే కళంకం. భాస్కర్ బాలికల ప్రభుత్వ కళాశాలలో గత రెండు సంవత్సరాలుగా బాలికలపై వేధింపు చర్యలకు పాల్పడుతున్నాడు. అమాయకమైన ఆడపిల్లల్ని చూసుకొని వారి పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారు. ఆడపిల్లలపై ఎక్కడపడితే అక్కడ చెయ్యి వేయడం, నాకు ఫీలింగ్స్ వస్తున్నాయి... నీ **వస్తున్నాయా, అంటూ రొమాంటిక్ గా మాట్లాడడం ఇతని మేనరిజం. ఒకటి కాదు రెండు కాదు రెండు సంవత్సరాల నుంచి ఇదే వేధింపులు. కళాశాల ప్రిన్సిపాల్ కి చెప్పిన, సంబంధించిన వారికి చెప్పిన ఎవరూ పట్టించుకోలేదు. ఇలానే కొనసాగితే విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింటుందని బాలికలు భాస్కర్ విషయం తల్లిదండ్రులకు తెలిపారు. వెంటనే తల్లిదండ్రులు కళాశాల దగ్గరికి చేరుకొని విద్యార్థుల సంఘాలతో కలిసి తెలుగు లెక్చరర్ కు దేహశుద్ధి చేశారు. విద్యార్థినీల తల్లిదండ్రులు ఆగ్రహంతో తెలుగు లెక్చరర్ ను దూషించుతూ నీకు భార్య , ఆడబిడ్డలు పిల్లలు ఎవరూ లేరా తీవ్రమైన పదజాలంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. దమ్ముంటే జాబ్ రిజైన్ చేసి వెళ్ళాలని ఏబీవీపీ సంఘాలు రోడ్ల పైన బైఠాయించారు. విద్యార్థినీ విద్యార్థులకు భద్రత కల్పించాలి ఇటువంటి ఘటన మళ్లీ పునరావృతం కావద్దని ఆందోళన చేపట్టారు. ఈ సంఘటనపై బాధ్యుడు లెక్చరర్ మహేష్ పై వెంటనే ఫోక్సో కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటనపై పూర్తి వివరాలను వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

# ప్రభుత్వ డ్యూటీనా.. ప్రైవేట్ సేవలా.? డాక్టర్‌పై ఆరోపణలు!?

- ప్రభుత్వ ఆస్పత్రిలో విధులు.. ప్రైవేట్‌లో వైద్యం
- డ్యూటీ సమయంలో ప్రైవేట్ ప్రాక్టీస్‌పై ప్రశ్నలు
- రోగులను ప్రైవేట్ ఆస్పత్రికి మళ్లిస్తున్నారా.?
- హాజరు, డ్యూటీ సమయాలపై విచారణకు డిమాండ్
- సీసీటీవీ, రికార్డులు పరిశీలించాలని ప్రజల విజ్ఞప్తి




**మెదక్, ఆగస్టు 18 (నేటి దర్శిని):** ప్రభుత్వ ఆస్పత్రిలో చిన్నపిల్లల వైద్యుడిగా విధులు నిర్వహిస్తున్న ఓ వైద్యుడి వ్యవహారంపై స్థానికులు పలు అనుమానాలు, ఆరోపణలు వ్యక్తం చేస్తున్నారు. సదరు వైద్యుడికి ఓ ప్రైవేట్ ఆస్పత్రి యాజమాన్యంతో సంబంధాలు ఉన్నాయని, ప్రభుత్వ ఆస్పత్రిలో విధులు నిర్వహించాల్సిన సమయంలోనే ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్య సేవలు అందిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే చిన్నారుల రోగులు తరచూ ప్రైవేట్ ఆస్పత్రిలో కనిపిస్తుండటంతో, వారిని అక్కడికి మళ్లిస్తున్నారా అనే అనుమానాలు స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రిలో విధులు నిర్వహించాల్సిన సమయంలో ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్య సేవలు ఎలా అందిస్తున్నారనే ప్రశ్నలు కూడా తలెత్తుతున్నాయి. ఒకవైపు ప్రభుత్వ ఆస్పత్రిలో విధులు, మరోవైపు ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్య సేవలు కొనసాగుతున్నాయన్న ఆరోపణలు నిజమైతే ఇది విధి నిర్వహణ నిబంధనలకు సంబంధించిన తీవ్రమైన అంశంగా మారే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత వైద్యుడి వివరణ, అధికారుల అధికారిక నిర్ధారణ వెలువడాల్సి ఉంది. ఈ నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ముఖ్యంగా వైద్యుడి డ్యూటీ సమయాలు, హాజరు రికార్డులు, బయోమెట్రిక్ వివరాలు, ప్రభుత్వ ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న సీసీటీవీ ఫుటేజీ, అలాగే ప్రైవేట్ ప్రాక్టీస్‌కు సంబంధించిన నిబంధనలు పరిశీలించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఆరోపణల్లో వాస్తవం ఎంత, అవాస్తవం ఎంత అనే విషయాన్ని అధికారిక విచారణ ద్వారా తేల్చి, నిజానిజాలను ప్రజల ముందుంచాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఆరోపణలు నిజమని తేలితే నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, అదే సమయంలో ఆరోపణలు నిరాధారమైతే వాస్తవ పరిస్థితిని స్పష్టం చేయాలని వారు కోరుతున్నారు.

## శ్వేతా అగర్వాల్ జన్మదినం సందర్భంగా పేద పిల్లలకు మధ్యాహ్న భోజనం





**ఎల్.బి.నగర్ ఆగస్టు18 (నేటి దర్శిని):** శ్వేతా అగర్వాల్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం సరూర్‌నగర్‌లోని పేద పిల్లల పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. యమునానగర్ నివాసి శ్రీమతి శ్వేతా అగర్వాల్ జన్మదినం సందర్భంగా ఈ సేవా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పేద పిల్లలకు మధ్యాహ్న భోజనం అందజేశారు. అనంతరం పిల్లలతో కలిసి శ్వేతా అగర్వాల్ కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. పిల్లలు సైతం ఆమెకు ప్రేమపూర్వకంగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కృష్ణ గోపాల్ సేవా సమితి సభ్యులు, అధికారులు శ్వేతా అగర్వాల్ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. భగవంతుడు ఆమెకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు ప్రసాదించాలని, వ్యక్తిగత జీవితంతో పాటు వ్యాపార రంగంలో మరింత అభివృద్ధి, విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. జన్మదినం, వివాహ వార్షికోత్సవం వంటి శుభ సందర్భాలను సేవా కార్యక్రమాల ద్వారా జరుపుకోవడం ద్వారా సమాజంలోని నిరుపేదలకు అండగా నిలవచ్చని నిర్వాహకులు తెలిపారు.

## కురుమేడు ఎక్స్‌రోడ్‌లో ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి

- గౌడ సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో వేడుకలు



**చింతపల్లి, ఆగస్టు 18 (నేటి దర్శిని):** కురుమేడు ఎక్స్‌రోడ్‌లో శ్రీశ్రీశ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజు 376వ జయంతి వేడుకలను చింతపల్లి మండల తెలంగాణ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షుడు అనంతుల వెంకటయ్య గౌడ్, కన్వీనర్ అనంతుల జంగయ్య గౌడ్, జిల్లా కన్వీనర్ అనంతుల పెద్దమల్లేష్ గౌడ్ తదితరుల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. కురుమేడు సర్పంచ్ చిన్నమ్మ లాలయ్య, ప్రశాంతపురి సర్పంచ్ శ్రీనునాయక్, ఉపసర్పంచ్ పవన్ గౌడ్, మాజీ సర్పంచులు రమేష్, రాటకొండ నరేంద్ర ప్రసాద్, మాజీ ఎంపీటీసీ ఉప్పు శ్రీశైలం, గౌడ సంఘాల నాయకులు అల్వాల వెంకట గౌడ్, గౌని రవి గౌడ్ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని వివిధ గ్రామాల గౌడ కుటుంబ సభ్యులు, బహుజన బంధువులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను కొనసాగిస్తూ బహుజన సమాజ అభ్యున్నతికి కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

# నసర్లపల్లిలో ఉచిత వైద్య శిబిరం

- కామినేని హాస్పిటల్స్ సౌజన్యంతో 110 మందికి వైద్య పరీక్షలు



**చింతపల్లి, ఆగస్టు 18 (నేటి దర్శిని):** చింతపల్లి మండలం నసర్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలో కామినేని హాస్పిటల్స్, ఎల్బీ నగర్ సౌజన్యంతో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామపంచాయతీ సర్పంచ్ పంబలి మాలతి వెంకటయ్య చేతుల మీదుగా శిబిరాన్ని ప్రారంభించారు. ఉదయం 9.45 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కొనసాగిన శిబిరంలో బీపీ, షుగర్, కంటి, ఎముకలు, కీళ్ల నొప్పులు, దంత సమస్యలు, చిన్నారుల ఆరోగ్య పరీక్షలతో పాటు సాధారణ రక్త పరీక్షలు, ఈసీజీ తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. తీవ్ర ఆరోగ్య సమస్యలు ఉన్నవారిని ప్రధాన ఆసుపత్రికి సిఫారసు చేసి, తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటామని వైద్యులు తెలిపారు. శిబిరంలో మొత్తం 110 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కామినేని ఆసుపత్రి వైద్యులు డాక్టర్ రుషిత, డాక్టర్ వినోది, డాక్టర్ లక్ష్మి, నర్సింగ్ సిబ్బంది ప్రియ, అశ్విత, మార్కెటింగ్ క్యాంపు కోఆర్డినేటర్ దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# పంటలు ఎండుతున్నాయి నీటిని వదలండి

## సబ్ కలెక్టర్ తో మొరపెట్టుకున్న ర్యాకల్ రైతులు



**నారాయణఖేడ్,ఆగస్ట్ 18 (నేటి దర్శిని):** నీళ్లు లేకపోవడం వల్ల పంటలు ఎండిపోతున్నాయి,నీటిని వదిలి పంటలను కాపాడాలని ర్యాకల్ గ్రామస్తులు మంగళవారం నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఎన్.ఉమాహారతిని కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ..ర్యాకల్ గ్రామంలోని పెద్దచెరువు కింద వందల ఎకరాలలో వరి పంటలు వేశామని,వర్షాభావం వల్ల వరిపంట ఎండిపోతున్నందున పెద్దచెరువు నుండి నీటిని విడుదల చేయాలని లస్కర్ మొగులయ్యకు అడుగగా ఇరిగేషన్ అధికారులకు వెళ్లి అడగండి వాళ్ళు చెబితేనే వదులుతానని,తన పరిధిలో ఏమి లేదని చెప్పాడు అన్నారు.మండల ఇరిగేషన్ ఏఈ నాగరాజుకు వెళ్లి అడుగగా ఎల్ఈనొ ప్రభావం వల్ల ప్రస్తుతం చెరువులో ఉన్న నీటిని కాపాడాలని పంటలకు వదులరాదని జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఉన్నాయని ఆయన చెప్పడంతో సబ్ కలెక్టర్ ఎన్.ఉమాహారతిని కలిసి నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని కోరడం జరిగింది అన్నారు.అందుకు సానుకూలంగా స్పందించిన ఆమె జిల్లా కలెక్టర్ ద్రుష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేశానని తెలపడం జరిగింది అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు పాల్గొన్నారు.

# అధికారులు,ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి

● ఎమ్మెల్యే సంజీవరెడ్డి
సబ్ కలెక్టర్ ఉమాహారతి




**నారాయణఖేడ్,ఆగస్ట్ 18 (నేటి దర్శిని):** నాగల్‌గిద్ద మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఎన్.ఉమా హారతిలు హాజరయ్యారు.ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై అధికారులను, సర్పంచులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.విద్యుత్,విద్య,వైద్యం,త్రాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం,డ్రైనేజీ తదితర మౌలిక వసతుల సమస్యలపై అధికారులతో సమీక్షించారు.ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ..గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని,ప్రజల నుంచి వచ్చే సమస్యలను వెంటనే గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, గ్రామాల్లో అభివృద్ధి పనులను నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేయాలన్నారు.విద్యుత్ సమస్యలు, పాఠశాలల్లో మౌలిక వసతులు,తాగునీటి సరఫరా,రోడ్ల అభివృద్ధి తదితర అంశాలపై సంబంధిత అధికారులతో ఎమ్మెల్యే చర్చించి, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో మండల అధికారులు, ప్రజాప్రతినిధులు,గ్రామ సర్పంచులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నేతాజీకి ఘన నివాళి

● పూలమాల వేసి నివాళులర్పించిన ప్రజా హక్కుల సాధన సమితి అధ్యక్షుడు తిరుగమల్ల షాలెమ్ రాజు



**చింతపల్లి, ఆగస్టు 18 (నేటి దర్శిని):** నల్గొండ పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో ప్రజా హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో ఆజాద్ హింద్ ఫౌజ్ వ్యవస్థాపకులు, స్వాతంత్ర్య సమరయోధులు నేతాజీ సుభాష్ చంద్రబోస్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా నేతాజీ చిత్రపటానికి ప్రజా హక్కుల సాధన సమితి వ్యవస్థాపక, రాష్ట్ర అధ్యక్షుడు తిరుగమల్ల షాలెమ్ రాజు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.దేశ స్వాతంత్ర్యం కోసం నేతాజీ సుభాష్ చంద్రబోస్ చేసిన పోరాటం, త్యాగం చిరస్మరణీయమని షాలెమ్ రాజు అన్నారు. ఆయన ఆశయాలను నేటి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.ఈ కార్యక్రమంలో సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కలకుంట్ల వినోద్ చారి, నాగరాజు, రమేష్, కార్తీక్, బన్నీ సూర్యనారాయణ, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో కల్తీ నెయ్యి

# హెచ్-ఫాస్ట్ దాడులు






- హైదరాబాద్‌లో భారీ ఆపరేషన్
- 130 తయారీ కేంద్రాల్లో తనిఖీలు
- 36 టన్నుల కల్తీ నెయ్యి సీజ్!
- కల్తీ నెయ్యి అమ్మితే కఠిన చర్యలు తప్పవు - సీపీ సజ్జనార్

**హైదరాబాద్, ఆగస్టు18 (నేటి దర్శిని):** భాగ్యనగరంలో ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న నకిలీ నెయ్యి తయారీ, విక్రయ ముఠాలపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. స్వచ్ఛమైన దేశీ నెయ్యి పేరుతో మార్కెట్‌లో యథేచ్ఛగా సాగుతున్న భారీ కల్తీ దందాను అధికారులు బహిర్గతం చేశారు. హైదరాబాద్ నగరవ్యాప్తంగా సాగిన ఈ విస్తృత దాడుల్లో ఏకంగా 36 టన్నుల అపరిశుభ్ర, కల్తీ నెయ్యితో పాటు, దాని తయారీకి ఉపయోగించే ముడి పదార్థాలు, ప్రమాదకర రసాయనాలను సీజ్ చేసినట్లు పోలీసులు మంగళవారం వెల్లడించారు.

**130 స్థావరాలపై దాడులు..**

విశ్వసనీయ సమాచారం, ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా 'హైదరాబాద్ ఫుడ్ అడల్ట్రేషన్ సర్వేలెన్స్ టీమ్' (హెచ్-ఫాస్ట్), ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ అధికారులు సంయుక్తంగా ఈ ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహించారు. నగరవ్యాప్తంగా ఉన్న 39 నెయ్యి తయారీ యూనిట్లు, 91 విక్రయ కేంద్రాలతో కలిపి మొత్తం 130 ప్రాంగణాల్లో అధికారులు ఏకకాలంలో తనిఖీలు చేపట్టారని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ స్పష్టం చేశారు. తనిఖీల సమయంలో అధికారులకు షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. నాసిరకం పదార్థాలు, శరీరానికి తీవ్ర హాని కలిగించే అనుమతి లేని రసాయనాలను క్రమబద్ధంగా కలిపి కృత్రిమ నెయ్యిని తయారు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ దాడుల్లో భాగంగా 36 టన్నుల కల్తీ నెయ్యి, మీగడ (ముడి సరుకు), పామాయిల్, వనస్పతి, కృత్రిమ నెయ్యి సువాసనలు తెచ్చే రసాయనాలు, స్టార్చ్, ఇతర కెమికల్ అడిటివ్స్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు జప్తు చేశాయి. ఘటన స్థలంలోనే ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్లు ల్యాబ్ పరీక్షల కోసం నమూనాలను సేకరించారు."కల్తీ మిశ్రమాన్ని '100% ప్యూర్ దేశీ నెయ్యి' అనే ఆకర్షణీయమైన ప్యాకింగ్‌తో సాధారణ ప్రజలకు విక్రయిస్తున్నారు. ఇది ప్రజారోగ్యానికి తీవ్రమైన ముప్పు కలిగిస్తుంది," అని సీపీ సజ్జనార్ ఆందోళన వ్యక్తం చేశారు. అసలైన నెయ్యి రుచి, సువాసన, రంగును కృత్రిమంగా రప్పించడానికి కొందరు తయారీదారులు పామాయిల్, వనస్పతి, స్కిమ్డ్ మిల్క్ పౌడర్, స్టార్చ్, కెమికల్ ఫ్లేవర్లను వాడుతున్నారని సీపీ సజ్జనార్ వివరించారు. చివరికి కొన్ని ఉత్పత్తుల్లో అసలు పాలకు సంబంధించిన ఏ ఒక్క పదార్థం కూడా లేకపోవడం గమనార్హం.

**బాధ్యతారాహిత్యంగా ప్యాకింగ్, విక్రయాలు..**

ఈ కల్తీ ఉత్పత్తులను పారదర్శక కవర్లలో ప్యాక్ చేసి "100% స్వచ్ఛమైన నెయ్యి", "ప్రీమియం నెయ్యి", "ఫార్మ్ ఫ్రెష్ నెయ్యి", "నేచురల్ నెయ్యి" అనే పేర్లతో మార్కెట్‌లో విక్రయిస్తున్నారని టాస్క్‌ఫోర్స్ డిసిపి గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ తెలిపారు. ఈ ప్యాకెట్లపై కనీస నిబంధనలైన బ్యాచ్ నంబర్, ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ వివరాలు, తయారీ మరియు గడువు ముగిసే తేదీలు, క్వాలిటీ సర్టిఫికేట్ వంటివి ఏవీ ముద్రించలేదని ఆయన వెల్లడించారు. కల్తీ శాతాన్ని బట్టి (10 శాతం నుంచి 40 శాతం వరకు) ఈ నకిలీ నెయ్యిని వేర్వేరు వ్యాపారాలకు మళ్లించేవారని దర్యాప్తులో తేలింది. తక్కువ కల్తీ ఉన్నదాన్ని హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, స్వీట్ షాపులు, ఆయుర్వేద దుకాణాలకు సరఫరా చేస్తుండగా, తీవ్రంగా కల్తీ చేసిన నెయ్యిని పూజల కోసం వాడే నెయ్యిగా మార్కెట్‌లోకి వదిలారు. ఈ తయారీకి కావాల్సిన పాల మీగడను మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, గుజరాత్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి తెప్పించుకునేవారని పోలీసులు తెలిపారు. చవకైన ప్రత్యామ్నాయ పదార్థాలతో అతి తక్కువ ఖర్చుతో ఈ నకిలీ నెయ్యిని తయారు చేసి, మార్కెట్‌లో అసలైన నెయ్యి ధరలకు అమ్మి అక్రమార్కులు భారీగా లాభాలు గడించారని పోలీసులు పేర్కొన్నారు. ఈ కల్తీ నెయ్యిని కేవలం హైదరాబాద్‌లోనే కాకుండా తెలంగాణ వ్యాప్తంగా, పొరుగు రాష్ట్రాలకు కూడా సరఫరా చేసినట్లు విచారణలో వెల్లడైంది. ప్రస్తుతం ఈ వ్యవహారంపై కేసులు నమోదు చేసే ప్రక్రియ వేగంగా జరుగుతోందని సీపీ సజ్జనార్ వివరించారు.

**కల్తీ ఆహారపదార్థాలతో ప్రజారోగ్యానికి గండి**

ఆహార పదార్థాలను విచ్చలవిడిగా కల్తీ చేస్తూ కొంతమంది అక్రమార్కులు సమాజంపై నిశ్శబ్ద దాడికి దిగుతున్నారు. రసాయనాలు, నాణ్యత లేని కల్తీ ఆహారపదార్థాలతో ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. కల్తీ ఆహారంపై ఉక్కుపాదం మోపాలన్న ప్రభుత్వ ఆదేశాలతో కల్తీ రాయుళ్లపై హెచ్-ఫాస్ట్ కొరడా ఝులిపించింది. ఇటీవల ఫుడ్సేఫ్టీ అధికారులు పలు హోటళ్లలో నిర్వహించిన తనిఖీల్లో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. పరిశుభ్రత లేని ఆహారపదార్థాలు, బొద్దింకలు లాంటివి దర్శనమిచ్చాయి.

# బాలికల రక్షణకై ప్రత్యేక చట్టాలు







**నారాయణఖేడ్,ఆగస్ట్ 18 (నేటి దర్శిని):** బాలికలు, మహిళలు, యువతుల రక్షణకై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చట్టాలు,టోల్ ఫ్రీ నంబర్లను ఏర్పాటు చేసిందని, ప్రతీ ఒక్కరు చట్టాలపై అవగాహనా కలిగి ఉండాలని సిర్గాపూర్ మండల ఎస్సై 2 నారాయణ, షీటీం ఏఎస్సై తులసిరాం, కానిస్టేబుల్ చాంగుభాయిలు అన్నారు.మంగళవారం వారు సిర్గాపూర్ మండల కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల మరియు కళాశాలలో షీటీం ఆధ్వర్యంలో విద్యార్థినులకు చట్టాలపై అవగాహనా కల్పించారు.ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ..జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్,డిఎస్పీ వెంకట్ రెడ్డి,సిఐ వెంకట్ రెడ్డిల ఆదేశాల మేరకు బాలికలు,మహిళలకు అవగాహనా కల్పించడం జరుగుతుంది అన్నారు.సోషల్ మీడియాను ఉపయోగించే సమయంలో వ్యక్తిగత వివరాలు, ఫొటోలు,పాస్‌వర్డ్‌లు అపరిచితులతో పంచుకోవద్దని, అనుమానాస్పద లింకులు, సందేశాలకు స్పందించకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.మహిళల భద్రతకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, మహిళలు, బాలికల రక్షణపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు.18 ఏళ్ళు నిండిన తర్వాతే అమ్మాయిలకు పెళ్లిళ్లు చేయాలని,మైనర్లకు వివాహాలు చేయాలని చూస్తే టోల్ ఫ్రీ నంబర్లు,అంగన్వాడీ కేంద్రాలలో లేదా పోలీస్ స్టేషన్ లలో పిర్యాదు చేయాలన్నారు.అత్యవసరం అయితే చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్ 1098, ఉమెన్స్ హెల్ప్ లైన్ నంబర్ 181,సైబర్ హెల్ప్ లైన్ నంబర్ 1930,పోలీస్ హెల్ప్ లైన్ నంబర్ 112,షీ టీం హెల్ప్ లైన్ నంబర్ 9121610750 కు సంప్రదించాలి అన్నారు.ఎవరైనా ఆకతాయిలు అమ్మాయిల వెంటపడితే,ఆట పట్టించడం,ర్యాగింగ్ చేయడం, అమ్మాయిల, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన పాఠశాల, కళాశాల,బస్టాండ్లలలో షీ టీం సభ్యులు మఫ్టీలో పర్యవేక్షిస్తూ అందుబాటులో ఉంటుంది అన్నారు.అలాగే ఇంస్టాగ్రామ్, వాట్సాప్,గూగుల్ ఆన్లైన్ పై సైబర్ క్రైమ్ పోలీసులు పర్యవేక్షణ ఉంటుంది అన్నారు.మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే వారు ఎంతటి వారైనా సరే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో గురుకులం ప్రిన్సిపాల్,అధ్యాపక బృందం,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడిగా నరేందర్ రెడ్డి.. కిషన్ రెడ్డితో భేటీ..

**ఇబ్రహీంపట్నం (ఆగస్టు 18) (నేటి దర్శిని):** తెలంగాణ సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ సర్పంచుల ఫోరం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా ఏనుగు నరేందర్ రెడ్డి నియమితులైన అనంతరం మంగళవారం బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.జిల్లా అధ్యక్ష పదవి కోసం తనకు సహకారం అందించిన మంచిరెడ్డి కిషన్ రెడ్డికి ఏనుగు నరేందర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచుల సమస్యలు, గ్రామాల అభివృద్ధి తదితర అంశాలపై చర్చించారు. సర్పంచుల సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని నరేందర్ రెడ్డి తెలిపారు.



# సీఎం విజయ్ తనయుడి 'సిగ్మా' రిలీజ్ డేట్ ఫిక్స్..

## గాంధీ జయంతిన రాబోతున్న సందీప్ కిషన్!




కోలీవుడ్ స్టార్ హీరో, తమిళనాడు సీఎం విజయ్ తనయుడు జేసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయమవుతున్న మోస్ట్ అంటెసిపేటెడ్ యాక్షన్ హీస్ట్ డ్రామా 'సిగ్మా'. టాలెంటెడ్ హీరో సందీప్ కిషన్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన అప్‌డేట్ ప్రస్తుతం సినీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ప్రముఖ నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుభాస్కరన్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంబంధించి మేకర్స్ తాజాగా అధికారిక విడుదల తేదీని ప్రకటించారు. గాంధీ జయంతి కానుకగా 2026 అక్టోబర్ 2వ తేదీన ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా ఘనంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది. ఈ ప్రకటనతో పాటు విడుదల చేసిన సరికొత్త పోస్టర్‌లో సందీప్ కిషన్ మునుపెన్నడూ లేని విధంగా అత్యంత ఇంటెన్స్ లుక్‌లో కనికట్టు చేస్తున్నారు. ఈ చిత్రంలో సందీప్ కిషన్ సరసన టాలెంటెడ్ బ్యూటీ ఫరియా అబ్దుల్లా కథానాయికగా నటిస్తుండగా, నూతన దర్శకుడి ప్రతిభకు తగ్గట్టుగా భారీ తారాగణం ఈ సినిమాలో భాగమైంది. ప్రముఖ కొరియోగ్రాఫర్, నటుడు రాజు సుందరం, వర్సటైల్ యాక్టర్ సంపత్ రాజ్, శివ్ పండిట్, అన్బు దాసన్, యోగ్ జాపీ, షీలా రాజ్‌కుమార్ మరియు కిరణ్ కొండ వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. సాంకేతిక నిపుణుల విషయానికి వస్తే, స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ ఎస్. థమన్ ఈ సినిమాకు అదిరిపోయే సంగీతం అందిస్తుండగా, కృష్ణన్ వసంత్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు మరియు ప్రవీణ్ కేఎల్ ఎడిటింగ్ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారు. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సినిమా విడుదల తేదీ ఖరారు కావడంతో, రాబోయే రోజుల్లో టీజర్, పాటలతో పాటు ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.



## కుందనపు బొమ్మలా మెరిసిన రుక్మిణి వసంత్..

# సంక్రాతి బరిలో మెగా 158 మూవీ

మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం మెగా158 నుంచి సినీ అభిమానులకు అదిరిపోయే అప్‌డేట్ వచ్చింది.




ఈ చిత్రాన్ని సంక్రాంతి 2027 కానుకగా థియేటర్లలోకి తీసుకురావడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. అనుకున్న ప్లాన్ ప్రకారం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే దాదాపు 40 రోజుల చిత్రీకరణ విజయవంతంగా పూర్తయింది. సినిమాకు సంబంధించి ఫస్ట్ హాఫ్ ఎడిటింగ్ దాదాపు పూర్తయి లాక్ అయినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన తాజా షెడ్యూల్ హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా, భారీ బడ్జెట్‌తో ఈ విజువల్ స్పెక్టాకిల్‌ను నిర్మిస్తోంది. మెగాస్టార్ పుట్టినరోజైన ఆగస్ట్ 22న సినిమా నుంచి అదిరిపోయే అఫీషియల్ అప్‌డేట్ విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. బాబీ డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమా మీద భారీ అంచనాలు ఉన్నాయి. మన శంకర వరప్రసాద్ గారు లాంటి బ్లాక్ బస్టర్, వాల్తేరు వీరయ్య లాంటి కాంబో కావడంతో ఈ సినిమా మీద కూడా ముందు నుంచి అందరి ఫోకస్ ఉంది. ఇప్పటికే సంక్రాంతికి అనిల్ రావిపూడి వెంకటేష్ కళ్యాణ్ రామ్ సినిమా. రవితేజ శ్రీవిష్ణు ఎంటర్‌టైనర్, శర్వానంద్- శ్రీనువైట్ల కాంబో చిత్రం, ప్రశాంత్ వర్మ 'మహాకాళి', సాయి దుర్గా తేజ్ సంబరాల ఏటిగట్టు సినిమాలు ఉండగా ఇప్పుడు మెగాస్టార్ సినిమా కూడా అదే సీజన్ మీద కన్నేయడంతో ఏం జరగనుంది అనేది చూడాలి.



# మాజీ లవర్‌పై అనుపమ పరమేశ్వరన్ నిప్పులు

అనుపమ పరమేశ్వరన్ తన బ్రేకప్, గత రిలేషన్‌షిప్ గురించి సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రేమించేటప్పుడు అంతా బానే ఉన్నా, విడిపోయిన తర్వాత నరకమేనని ఆమె పేర్కొన్నారు. గతంలో తానొక టాక్సిక్ రిలేషన్‌షిప్‌లో ఉన్నానని, ఎమోషనల్‌గా చాలా బాధపడ్డానని తెలిపారు. కొన్ని నెలలకే పెళ్లి దాకా మాటలు వచ్చినా, ఆ తర్వాతే తన మాజీ ప్రియుడి నిజ స్వరూపం బయటపడిందని ఆవేదన వ్యక్తం చేశారు. అతను తన బట్టలు, సోషల్ మీడియా పోస్టుల విషయంలో ఆంక్షలు విధించడంతో స్వేచ్ఛను పూర్తిగా కోల్పోయానని అనుపమ వివరించారు. అపరిచితుడు సినిమాలో విక్రమ్ పాత్రలాగా అతను క్షణానికొక రకంగా ప్రవర్తించేవాడని ఆమె సంచలన కామెంట్స్ చేశారు. ఈ చేదు అనుభవం వ్యక్తిగత జీవితం పైనే కాకుండా తన కెరీర్‌పైనా తీవ్ర ప్రభావం చూపిందని, డ్రాగన్ ప్రమోషన్స్‌కు కూడా వెళ్లనివ్వకుండా అడ్డుకున్నాడని అనుపమ వెల్లడించారు. ఈ బంధం ఇలాగే కొనసాగితే మనశ్శాంతి దూరమవుతుందని గ్రహించి బ్రేకప్ చెప్పానని తెలిపారు. ఈ నిర్ణయం తీసుకోవడానికి తాను మానసికంగా చాలా మధనపడ్డానని ఆమె చెప్పుకొచ్చారు. ప్రస్తుతం తన ఫోకస్ అంతా కెరీర్‌పైనే ఉందని, జీవితంలో మళ్లీ సంతోషాన్ని నింపుకునే పనిలో ఉన్నానని అనుపమ పరమేశ్వరన్ తెలిపారు. అయితే, తన మాజీ ప్రియుడి పేరును ఆమె బయటపెట్టలేదు.

# డిసి చిత్రంపై అల్లు అర్జున్ ప్రశంసలు




తమిళ చిత్ర పరిశ్రమలో సంచలనం సృష్టిస్తున్న 'డీసీ' చిత్రంపై టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ప్రశంసలు కురిపించారు. ఇప్పటికే రూ. 85 కోట్ల వసూళ్లను సాధించి, రూ. 100 కోట్ల క్లబ్ దిశగా దూసుకెళ్తున్న ఈ సినిమాపై ఆయన సోషల్ మీడియా వేదికగా తన అభిప్రాయాలను పంచుకున్నారు. 'ఈ సినిమా ఒక అద్భుతమైన తమిళ క్లాసిక్ అని, సినిమాను ప్రేమించే ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా చూడాల్సిన చిత్రమని ఆయన కొనియాడారు. ఈ చిత్రాన్ని అర్థం చేసుకోగలిగే వారికి ఇది ఒక కవితలా ఉంటుందని' బన్నీ అభివర్ణించారు. ఇక దర్శకుడు అరుణ్ మాథేశ్వరన్ మేకింగ్ స్టైల్‌కు తాను ఫిదా అయ్యానని తెలుపుతూ, చిత్ర బృందం మొత్తానికి ఆయన అభినందనలు తెలియజేశారు. ముఖ్యంగా ఈ సినిమాకు ప్రాణం పోసిన సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ పనితీరును అబ్సల్యూట్ మాస్టర్ బ్లాస్టర్‌గా బన్నీ అభివర్ణించారు. సాంకేతికంగా కూడా ఈ చిత్రం అత్యున్నత ప్రమాణాలతో తెరకెక్కిందని ఆయన పేర్కొన్నారు. నటీనటుల విషయానికి వస్తే, వామికా గబ్బి నటన అద్భుతమని మెచ్చుకుంటూనే, ప్రధాన పాత్రలో హీరోగా నటించిన దర్శకుడు లోకేష్ కనగరాజ్ నటనను కూడా ప్రత్యేకంగా ప్రశంసించారు. తన మిత్రుడు లోకేష్ కనగరాజ్ తనకు ఎల్లప్పుడూ ఒక గొప్ప మద్దతుగా ఉంటారని అల్లు అర్జున్ సంతోషం వ్యక్తం చేశారు. విడుదలైన కొద్ది కాలంలోనే బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లను రాబడుతూ, సినీ వర్గాల్లో 'డీసీ' మూవీ హాట్ టాపిక్‌గా మారింది.

# నాన్‌స్టాప్‌గా 'రాపో23'



హీరో రామ్ పోతినేని స్వీయ దర్శకత్వంలో నటిస్తున్న తాజా చిత్రం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్నది. 'రాపో23' వర్కింగ్ టైటిల్‌తో సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇటీవలే పుదుచ్చేరి శివార్లలో 24 గంటల పాటు నిర్విరామంగా ఈ సినిమా షూటింగ్‌ను జరిపారు. హీరోగా, దర్శకుడిగా ఈ సినిమా కోసం రామ్ ఎంతగానో శ్రమిస్తున్నారని, ప్రతి అంశాన్ని జాగ్రత్తగా పర్యవేక్షిస్తున్నారని యూనిట్ వర్గాలు తెలిపాయి.'పుదుచ్చేరిలో వేసిన భారీ సెట్‌లో తొమ్మిది రోజుల పాటు షూటింగ్ జరిపాం. ఇటీవల వర్షాల కారణంగా షెడ్యూల్‌కు బ్రేక్‌పడింది. త్వరలో మళ్లీ షూటింగ్‌ను మొదలుపెడతాం' అని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: సామ్ సీఎస్, నిర్మాత:కృష్ణ పోతినేని.


**Published and Owned By Katta Hima Pavani Published at H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505. Printed at Smilys Online 6-7-48, Vanasthalipuram Shopping Complex, Ranga Reddy District, Telangana-500070, Editor: Katta Hima Pavani, PRGI NO: TGTEL/25/A0471, Phone: 94920 33365**